

మానవత సంస్థ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవలు అందించడం అభినందనీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా వేళ్లచింతలగూడెం గ్రామంలో కొంతమంది సభ్యులకు సంపూర్ణ పోషకాహారంగా కోడిగుడ్లు, పళ్లు, రైస్ బ్యాగ్స్ అందజేసి వారిలో మనో ధైర్యాన్ని నింపారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు, గుండె జబ్బుతో బాధ పడుతున్న వ్యాధిగ్రస్తులకు, చదువుకుంటున్న పేద విద్యార్థికి కొంత ఆర్థిక సాయం అందజేశారు.

చైతన్య ఝురి.. రాజమహేంద్రి ఎంపీ బరి..

తొలి ఎన్నికల్లో గెలుపు కమ్యూనిస్టులదే


తాజాగా 18వ సారి ఎన్నికలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రంలో కవులకు, కళాకారులకు పుట్టినిల్లు, సాంస్కృతిక కళా రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రి పార్లమెంట్ స్థానానికి ప్రత్యేక స్థానం ఉంది. స్వాతంత్ర ఉద్యమంతో పాటు సాంఘిక ఉద్యమాలకు ఈ ప్రాతం కేంద్ర బిందువుగా చరిత్రలో చెరగని ముద్ర ఉంది. అటువంటి ప్రత్యేకత కలిగిన ఈ ప్రాంతంలో తాజాగా 18వసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా తీర్పు ఎలా ఉండబోతుందో అనే మీమాంశ రాజకీయ పార్టీలను వెంటాడుతోంది. 2014లో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన గత పదేళ్లలో రాష్ట్రాలు, స్థానిక సంస్థల హక్కులను దూరం చేసిన విషయం విదితమే. 2014 రాష్ట్ర విభజన అనంతరం ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం నిర్మాణానికి నిధులు వంటివి మేడిపండు చందంగా మారాయి. అటువంటి బిజెపి విధానాలకు అధికార వైసిపి, విపక్ష టిడిపి పార్లమెంటు సభ్యులు ప్రశ్నించిన దాఖలాలు లేవు. బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బిల్లులకు పోటీపడి మద్దతు తెలపటం ఓటర్లను ఆలోచింపజేస్తోంది. 2009లో బిజెపి పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసిన సోము వీర్రాజుకు కనీస డిపాజిట్లు దక్కలేదు. ప్రత్యర్థి ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు 3,57,449 ఓట్లు రాగా సోము వీర్రాజుకు కేవలం 7,123 ఓట్లు మాత్రమే వచ్చాయి. 2004లో బిజెపి అభ్యర్థి కంటిపూడి సూర్యనారాయణపై కాంగ్రెస్ అభ్యర్థి ఉండవల్లి అరుణ్ కుమార్ 1,39000 పైగా మెజారిటీతో గెలుపొందారు. అటువంటి బిజెపి టిడిపి, జనసేనతో పొత్తు నేపథ్యంలో మరోసారి బరిలో దిగేందుకు సిద్ధమయింది. 18వ సారి జరిగే ఈ ఎన్నికలలో ప్రజల తీర్పు ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.

తొలి గెలుపు కమ్యూనిస్టులదే

రాజమహేంద్రి పార్లమెంటు స్థానంలో చైతన్యవంతమైన ఓట్లు ఉన్నారు. స్వాతంత్ర్య సమరయోధులతో పాటు కళాకారులను సైతం ఈ ప్రాంత ప్రజలు ఆదరించి పార్లమెంటు సభ్యునిగా విజయం అందించారు. స్వాతంత్ర్యానంతరం తొలి గెలుపు కమ్యూనిస్టులదే. 1952లో జరిగిన ఎన్నికలలో ఆ పార్టీ అభ్యర్థులు విజయఢంకా మోగించారు. కానేటి మోహనరావు, నల్లా రెడ్డినాయుడు తొలి పార్లమెంటు సభ్యులుగా



ప్రజలకు సేవలందించారు. అనంతరం 1957 నుంచి 1984 వరకూ వరుసగా జరిగిన ఆరు ఎన్నికలలోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దాట్ల సత్యనారాయణ రాజు మూడుసార్లు ఎన్నికకాగా అనంతరం ఎస్‌బిపి పట్టాభిరామారావు మూడుసార్లు ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన అనంతరం 1984లో ఆ పార్టీ నుంచి చుండ్రు శ్రీహరిరావు ఎన్నికయ్యారు. 1989లో ప్రముఖ సినీ నటి జూలూరి జమున పార్లమెంటుసభ్యులుగా ఇక్కడి నుంచే ఎన్నికయ్యారు. 1991లో టిడిపి అభ్యర్థి కెవిఆర్ చౌదరి గెలుపొందారు. 1998లో బిజెపి అభ్యర్థి గిరజాల వెంకటస్వామి నాయుడు 1999లో ఎస్‌బిపిబికె సత్యనారాయణరావు గెలుపొందారు. 2004, 2009లో వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉండవల్లి అరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, ప్రముఖ సినీ నటుడు మాగంటి మురళీమోహన్ గెలుపొందారు. గెలుపొందిన అనంతరం ప్రజలకు అందుబాటులో లేరనే విమర్శలను ఎదుర్కొన్నారు. 2019లో ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన పాదయాత్ర ఫలితంగా వైసిపి అభ్యర్థి మార్గాని భరత్ రామ్ గెలుపొందారు. ఆ పార్టీ విప్‌గా పార్లమెంటు సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించి తాజాగా రాజమండ్రి అసెంబ్లీ బరిలో పోటీకి సిద్ధమయ్యారు.

18వ పార్లమెంటు సభ్యులు ఎవరు..?

స్వాతంత్ర్యానంతరం 18వ సారి జరిగే ఈ ఎన్నిల్లో ప్రజాతీర్పు ఎలా ఉండబోతోందోననే సందేహం రాజకీయ పార్టీలను వెంటాడుతోంది. వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రముఖ వైద్యులు గూడూరి శ్రీనివాస్ బరిలో నిలిచారు. టిడిపి, జనసేన, బిజెపి పొత్తు నేపథ్యంలో ఈ స్థానంలో బిజెపి అభ్యర్థిగా పురందేశ్వరి పోటీ చేస్తున్నారు. తొలుత ఈ స్థానం నుంచి వైసిపి తరుపున ప్రముఖ సినీ దర్శకులు వివి.వినాయక్, నటులు సుమన్, స్థానిక నేతలు పేర్లు తెరపైకి వచ్చాయి. ఆ ఊహాగానాలకు వైసిపి అధినేత తెరదించి అభ్యర్థిని ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ తరుపున బొడ్డు వెంకటరమణ చౌదరి, శిష్టా లోహిత్‌లతో పాటు పలువురు స్థానిక నేతల పేర్లు వినిపించాయి. పొత్తు నేపథ్యంలో బిజెపికి కేటాయించినట్లు తెలుస్తోంది. బిజెపి చివరిసారిగా పోటీ చేసిన 2009లో కనీస డిపాజిట్లు దక్కకపోవటంతో ఆ పార్టీ అభ్యర్థి అంటూ ప్రచారం జరుగుతున్న మాజీ మంత్రి పురందేశ్వరి తొలుత వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది. అయితే పార్టీ అభ్యర్థిగా ఆమె పోటీకి దిగడం ఆసక్తి రేపుతోంది. ఈ పార్లమెంట్ స్థానం పరిధిలో అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌తోపాటు కొవ్వూరు గోపాలపురం, నిడదవోలు నియోజక వర్గాల్లో మొత్తం 16,05,752 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 7,85,142 మంది కాగా, మహిళా ఓటర్లు 8,20,515 మంది, ట్రాన్స్‌జెండర్స్ 105 మంది ఓటర్లు ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 2,71,159 మంది ఓటర్లు నమోదు కావడంతో జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గంగా నిలిచింది. కొవ్వూరు నియోజకవర్గం కేవలం 1,83,405 ఓటర్ల నమోదు అత్యల్ప నియోజకవర్గంగా నిలిచింది. తాజాగా జరిగే ఈ ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

ఎన్నికల నియమావళి అమలు తప్పనిసరి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల ప్రచారంలో రోడ్డు షోలు, ర్యాలీలు, సమావేశాలు, సభలు, మైక్ ప్రచారాలకు 48 గంటల ముందుగా అనుమతులు తీసుకోవాలని ఆర్‌ఓ, జెసి ఎస్.తేజ్‌భరత్ స్పష్టం చేశారు. అందుకోసం సువిధా యాప్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, సంభందిత పత్రాలు ఆర్‌ఓ కార్యాలయంలో అందచేయాలని పేర్కొన్నారు. సమావేశాలు, ఊరేగింపుల్లో ఎంతమంది పాల్గొంటారు, ఎన్ని వాహనాలు ఉపయోగిస్తారో తెలియ జేస్తూ ఆయా వాహనాల నెంబర్లు అందజేయాల్సి ఉంటుందన్నారు. సదరు ప్రచార సందర్భంలో ఎన్ని మైకులు ఉపయోగిస్తారు, ఏ మార్గంలో వెళతారో వివరాలు అందచేయాలన్నారు. ఎన్ని జెండాలు, బ్యానర్లు వినియోగిస్తారు అనే పూర్తి సమాచారాన్ని దరఖాస్తులో ఖచ్చితంగా పొందుపరచాల్సి ఉంటుందన్నారు. సందేహాలు నివృత్తి చేసేందుకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహశీల్దార్, రాజమహేంద్రవరం రూరల్ 9849903860, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తహశీల్దార్, కడియం 9849903901లను సంప్రదించాలన్నారు. ఊరేగింపులో పాల్గొనే వాహనాల రికార్డులు, డ్రైవర్ల లైసెన్స్ వివరాలు కూడా దరఖాస్తుతోపాటు రిటర్నింగ్ అధికారి వారికి అందజేయాలి, ఊరేగింపు యొక్క రూట్ మ్యాప్ ముందుగానే ఇవ్వాలి, అందులో ఖచ్చితంగా ప్రారంభించే ప్రదేశం, ర్యాలీ ముగించే ప్రదేశం తప్పని సరిగా తెలియ పరచాల్సి ఉంటుందని, ఇంటింటి ప్రచారం కోసం కూడా ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. ఒకే గ్రామంలో, ఒకే సమయంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ పార్టీలు అనుమతి కోసం దరఖాస్తు చేస్తే ముందుగా అప్లయ్ చేసిన వారికి అనుమతి మంజూరు చేస్తామన్నారు. మిగిలిన వారికి తేదీ మార్పు కోసం తెలియజేస్తామని తెలిపారు. ప్రార్థనా మందిరాలు, విద్యా సంస్థల దగ్గర ఏవిధమైన ప్రచార కార్యక్రమాలు చేయరాదు. ఒక పార్టీ వారు వేరొక పార్టీ వారి సమావేశాలకు, ఊరేగింపుల్లోకి వెళ్లి ఆటంకం కలిగించకూడదన్నారు. ఏ విధమైన కుల, మత, వర్గ పరమైన రెచ్చగొట్టే ప్రసంగాలు చెయ్యరాదు. రాతి 8 గంటల తర్వాత ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు చెయ్యరాదు. ఖచ్చితంగా అనుమతి మంజూరైన తర్వాత మాత్రమే అనుమతికి లోబడి ఏ విధమైన కార్యక్రమమైనా చేపట్టాలి. అందుకు విరుద్ధంగా ఎటువంటి కార్యక్రమం చేపట్టినా ఎన్నికల సంఘం జారీ చేసే ఎన్నికల ప్రవర్తనా నియమావళి కిందకు వస్తుంది. వాటికి సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఇచ్చే రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేస్తామన్నారు. ఆయా ఖర్చులు పార్టీకి లేదా అభ్యర్థి ఖర్చు కింద చూపుతాతమని తెలిపారు.

అనుమతి ఇచ్చే అంశాలు

డోర్ టూ డోర్ ప్రచారం, తాత్కాలిక పార్టీ కార్యాలయం తెరవడానికి, సభ నిర్వహించడానికి, వాహనాల కోసం లౌడ్ స్పీకర్‌తో నిర్వహించడానికి, లౌడ్ స్పీకర్‌తో ఊరేగింపు ఏర్పాటు చేయడం కోసం, స్ట్రీట్ కార్నర్ మీటింగ్, లౌడ్ స్పీకర్ కోసం, ఇంటింటికీ ప్రచారం కోసం కరపత్రాల పంపిణీ, వీడియో సందేశాలు, ఊరేగింపు కోసం, ఊరేగింపులో లౌడ్ స్పీకర్ కోసం, జెండాలను ప్రదర్శించడానికి, ఎయిర్ బెలూన్ల ప్రదర్శన, పోస్టర్స్, హోర్డింగ్స్ ఏర్పాటు కోసం అనుమతి హెలికాప్టర్, హెలిప్యాడ్ కోసం, వాహన అనుమతికి, వీడియో వ్యాన్ వినియోగం కోసం అభ్యర్థి కోసం పూర్తి అసెంబ్లీ పరిధిలో తిరుగడం కోసం ఒక వాహనం.

బడుగుల బలేనా సామాజిక న్యాయం

ప్రజాశక్తి-నల్లజర్ల

వైసిపి నేతల భూకబ్జాలకు నిండు కుటుంబం బలైందని. రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి, టిడిపి గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకట రాజు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు సిఎం జగన్ బాధ్యత వహించాలన్నారు. జగన్ పాలనలో బడుగు బలహీన వర్గాల ఆస్తులకు రక్షణ లేదన్న విషయం, చేనేత కుటుంబం బలవన్మరణంతో మరోసారి రుజువైందన్నారు. ఇదేనా నువ్వు చెబుతున్న సామాజిక న్యాయం అని ప్రశ్నించారు. రాజంపేట నియోజకవర్గంలో పాల సుబ్బారావు భార్య పద్మావతి. చిన్న కుమార్తె ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమన్నారు. వ్యవస్థలను చేతుల్లోకి తీసుకొని రికార్డులు తారుమారు చేస్తున్నారని, దుయ్యబట్టారు సొంత భూమిని కోల్పోయి ప్రభుత్వం న్యాయం చేయలేదని, ఆవేదనతో సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. జగన్ సొంత జిల్లాలో, నందం సుబ్బయ్య అనే పద్మశాలి నేతను అత్యంత దారుణంగా చంపేశారని, ఇప్పటికీ చర్యలు లేవన్నారు. ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

మానవత సంస్థ యూనిట్ ఏర్పాటు

ప్రజాశక్తి-చాగల్లు



సమావేశంలో మాట్లాడుతున్న కోడూరి రాధా పుష్పావతి

మానవత సేవా సంస్థ చాగల్లు మండలం నూతన యూనిట్ ఏర్పాటుపై పాటమ్మ అమ్మవారి ఆలయంలోని ఫంక్షన్ హాల్లో ఆదివారం మొట్టమొదటి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన మానవత స్టేట్ కన్వీనర్స్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లోనూ ఇచ్చాపురం నుంచి చిత్తూరు వరకు 112 మానవత సంస్థ యూనిట్లు ఉన్నాయని చెప్పారు. 595 మార్చురీ ఫ్రీజర్ బాక్సులు, 65 శాంతి రథాలు, 20 వాటర్ ట్యాంకర్స్, 15 అంబులెన్సులు అందించామన్నారు. 68,000 మంది పైన సభ్యులు సేవలు అందిస్తున్నారని అన్నారు. 2004వలో 108 సభ్యులతో ఎన్.రామచంద్రారెడ్డి ఈ సంస్థను ప్రారంభించారని రూ.600 సభ్యత్వ రుసుముతో ఈ సంస్థలో సభ్యులుగా చేరవచ్చని అన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన్ రావు మాట్లాడుతూ చాగల్లులో నూతన యూనిట్ ఏర్పాటు సమావేశం ఏర్పాటు చేయడం ఆనందదాయకంగా ఉందన్నారు. జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కొండెపు సూర్యనారాయణ మాట్లాడుతూ చాగల్లు మానవత యూనిట్‌కు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామనిన్నారు. ఈ సమావేశానికి 100 మంది పైన స్థానికులు స్థానికులు హాజరై మానవత యూనిట్ ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జజ్జవరపు వెంకట కృష్ణ ప్రసాద్, కొట్టూరు శ్రీనివాసు, శ్రీకాకుళం ఆంజనేయులు చాగల్లు మండలం ప్రముఖులు పాల్గొన్నారు 9 మందితో ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేశారు.

గోపాలంను కలిసిన డాక్టర్ గూడూరి

ప్రజాశక్తి-కడియం

వైసిపి రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా, కడియం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలంను ఆదివారం కలిసి మద్దతు కోరారు. కడియపులంక వచ్చిన గూడూరి ముందుగా గోపాలంను ఆయన నివాసంలో లోకలిశారు. ఈ సందర్భంగా గోపాలం శ్రీనివాస్‌కు మొక్కను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. నర్సరీల సమస్యలను గూడూరికి వివరించారు. అనంతరం గూడూరి శ్రీనివాస్ పలువురు నర్సరీ అధినేతలను కలిసి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో మార్గాని బలరామ్, సలాది ప్రసాద్, రెడ్డి శ్రీను, ఈలి సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు జనసేన నిడదవోలు నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్ సమక్షంలో ఆదివారం పార్టీలో చేశారు. తీపర్రు, పెరవలి, కాకరపర్రుకు చెందిన వారికి ఆయన పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు జనసేన పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మల్లుల నాని, పంపన సూరన్న, కుక్కల పవన్, ముప్పిడి కృష్ణ, సొంగా చిన్నా, పేకేటి మంగన్న, నేకురు రాంబాబు తదితరులు ఉన్నారు.

చాగల్లులో ముప్పిడి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని చాగల్లులో ఆదివారం టిడిపి కొవ్వూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, నాదల శ్రీరామ్ చౌదరి, దొంగ రామకృష్ణ, కె.రామాంజనేయులు, తాలూరి ప్రసాద్, కంచుమర్తి సుబ్బారావు, అల్తాఫ్, జొన్నకూటి వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఉత్తర పూర్ణిమ మహోత్సవాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగరంలోని పుష్కర్ ఘాట్ వద్ద ఆదివారం నిర్వహించిన సుబ్రహ్మణ్య స్వామి ఫాల్గుణ ఉత్తర పూర్ణిమ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలశ స్థాపన, స్వామి తిరువీధి రథోత్సవానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి మహిళలు పాల బిందెలతో వచ్చి అభిషేకాలు చేశారు.

జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, కడియం

జిల్లాను క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర ఎస్. వసుంధర పేర్కొన్నారు. ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక రాజమహేంద్రవరం జిల్లా క్షయ నివారణ కార్యాలయములో క్షయ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ జిల్లాను క్షయ రహిత జిల్లాగా చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తామన్నారు. జిల్లాలో 109 పంచాయతీలు టిబి ముక్త పంచాయతీలుగా ఎన్నికవడం పట్ల హర్షం ప్రకటించారు. ఇక ముందు కూడా ఇలానే కొనసాగాలని సూచించారు. జిల్లాలో 2023లో 51,668 టిబి కఫం టెస్టులు చేయగా 2,946 కేసులు నమోదైనట్లు తెలిపారు. మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ బ్యాక్టీరియా వల్ల టిబి వ్యాధి వస్తుందని, ఈ వ్యాధికి సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే ఈ వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. క్షయవ్యాధి పట్ల ఎటువంటి వివక్ష లేకుండా వ్యాధి సోకిన చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ చికిత్స అందిస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ టైగ్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు కాలంతో పాటు మారిన చికిత్స వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా 12 మంది టిబి రోగులకు డాక్టర్ టైగ్ పోషకాహార కిట్లను అందచేశారు. ఐఎంఎ సెక్రెటరీ డాక్టర్ వై.గురు ప్రసాద్ టిబి వ్యాధిని అంతం చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యమానికి ప్రియదర్శిని కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సాయి కాలేజీ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది డిఎన్ఎమ్ఒ డాక్టర్ పి.శ్రీనివాస్, ఎంఒటిసి డాక్టర్ సౌమ్య, ఎన్‌టిఇపి స్టాఫ్ ఎం.రాజు, వి.ఆచారి, ఎస్.గంగాధర్, కె.చందన్ కుమార్, ఎల్.సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్ కాలేజీ విద్యార్థుకు పోస్టర్ కాంపిటీషన్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. 2023లో టిబి విభాగంలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర, ఐఎంఎ సెక్రెటరీ వై.గురు ప్రసాద్, హార్లిక్స్ మేనేజర్ నిత్యానంద్, డాక్టర్ ఎం.ఎ.టైగ్, కోకాకోలా అసిస్టెంట్ మేనేజర్ డి.సతీష్ బాబు, పల్మోనాలజిస్ట్ డాక్టర్ ఎ.మేరీ వసంత తదితరులు పాల్గొన్నారు.




రాజమహేంద్రవరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది



కడియంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కడియం సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శివశంకర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శరీరంలో జుట్టు, గోళ్లు మినహా ఏ బాగానికైనా క్షయ వ్యాధి రావచ్చునని తెలిపారు . ఇది ఒకరి నుంచి మరొకరికి గాలి, తుంపర్ల ద్వారా సోకే తీవ్ర అంటువ్యాధి అన్నారు. వ్యాధిని నిర్ధారించే అధునాతన పరికరం కడియం ఆసుపత్రిలో ఉందన్నారు. రోగికి పూర్తిగా మందులు ఉచితంగా ఇస్తామని చెప్పారు. నెలకు రూ.500 విలువైన పౌష్టికాహారం కిట్లు రోగులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టివి.శ్రీధర్, డాక్టర్ మోహన వంశీ, డాక్టర్ శిరీష, డాక్టర్ సందీప్, టిబి సూపర్‌వైజర్ జి.శ్రీనివాస్, హెడ్ నర్సు కె.బాపనమ్మ, ఎక్సరే టెక్నీషియన్ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రాణాలు తీస్తున్న లాండ్ టైటిలింగ్ యాక్ట్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సిఎం జగన్ ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రాణాలు తీస్తోందని మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు ఆదివారం ఒక పేర్కొన్నారు. ఈ చట్టం వల్ల కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడమే అందుకు నిదర్శనమన్నారు. ఇంటి యజమాని సుబ్బారావు ఒంటిమిట్ట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోగా, ఆయన సతీమణి పద్మావతి, కుమార్తె వినయ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆస్తి వారి పేరుతో రికార్డుల్లో లేకపోవడంతో ఆ కుటుంబం మొత్తం మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుందన్నారు. రెవెన్యూ అధికారులు మోసం చేశారంటూ సూసైడ్ నోట్ రాశారని, ఏమి చేయలేని స్థితిలో చనిపోతున్నామని వాంగ్మూలం రాసారని పేర్కొన్నారు. ఈ యాక్ట్‌తో ప్రజల స్థిరాస్తులను లాగేసుకునేందుకు జగన్ కుట్ర పన్నారనడానికి ఇంతకన్న సాక్ష్యం లేదన్నారు. ఇది జగన్ చట్టం చేసిన హత్యలు కావా అని ప్రశ్నించారు. ఈ యాక్ట్ చాలా ప్రమాదకరమైన చట్టమని, జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రానున్న రోజుల్లో ఎవరి ఆస్తి ఎవరి చేతిల్లో ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. భూ వివాదంలో 553 సివిల్ కోర్టుల అధికారాలను చట్టంలోని సెక్షన్ 38 నిషేధిస్తుందని సూచించారు. రెవెన్యూ రికార్డుల్లో భూయజమాని పేరు మార్పు చేయాలంటే వారికి నోటీసు ఇచ్చే సెక్షన్ లేదన్నారు. ఈ చట్టం భారత వారసత్వ చట్టం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 246, 300లకు విరుద్ధమని, భూయాజమాన్య హక్కులను రెవెన్యూ అధికారులు నిర్ణయించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని, ఏ రాష్ట్రమూ ఇంతటి ప్రమాదకర చట్టం చేయలేదన్నారు. జగన్ బినామీ ఇండోసోల్ కంపెనీకి చెందిన విశ్వేశ్వరరెడ్డికి ఒక్క రామాయపట్నం పరిసరాలలోనే 8,500 ఎకరాల రైతుల భూములు కేటాయించారని ఆరోపించారు. ఇలా సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల పేరుతో లక్షలాది ఎకరాలను బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టి వారి ద్వారా జగన్ క్విడ్‌ప్రోకో చేసుకుంటున్నాడని ఆరోపించారు. గ్రీన్ కో, మేఘా, జిందాల్, జెఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ వారికి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల పేరుతో వేలాది ఎకరాలు కట్టబెట్టి వారి నుంచి ఎన్నికల బాండ్ల రూపంలో రూ.41 కోట్లు క్విడ్ ప్రోకో చేసుకున్నారని ఆరోపించారు. ఈ నల్లచట్టంతో జగన్, ఆయన ముఠా భూముల్ని ఇష్టారీతిన కొట్టేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. భూహక్కులను అధికారులు నిర్ణయించలేరని, న్యాయస్థానాలు మాత్రమే తేల్చగలవని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఓడిరచకపోతే.. ప్రజల ఆస్తులు ఉండవన్నారు.

ముస్లిములకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న టిడిపి నాయకులు

ముస్లిం సోదరుల కృష్ణ సుఖాల్లో తోడుగా ఉంటూ వారికి అండగా నిలుస్తామని తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు అన్నారు. స్థానిక దానవాయిపేటలోని మదీనా షాదీ ఖానాలో టిడిపి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహబూబ్ జానీ ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన పార్టీ రాజమండ్రి సిటీ ఇన్‌ఛార్జి అత్తి సత్యనారాయణ, రెడ్డి మణేశ్వరరావు, మజ్జి రాంబాబు, నగర బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, వై.శ్రీను పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లిములు చూపే త్యాగం, సహనం, దానం, టిడిపి హయాంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిములకు రంజాన్ తోఫా ఇచ్చేవారమన్నారు. ఈ కార్యక్రమంలో ఖాన్ భాషా, అహ్మద్, బషీర్, అజీజ్, మహమ్మద్ ఖాన్ భాయ్, రబ్బానీ, ఫయాజ్, కమాల్, రఫిక్ రాజా, లిమ్రా బాషా పాల్గొన్నారు.

నేడు రోటరీ ఆధ్వర్యాన వైద్య శిబిరం

నిడదవోలు : రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ అధ్వర్యంలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. సుభద్ర ఆసుపత్రి, గౌతమి దంత వైద్యశాల సౌజన్యంతో ఉచిత దంత, అన్ని రకాల రోగాలకు ఉచిత పరీక్షలు, ఉచిత మందులు అందజేస్తామన్నారు. ఐ.పంగిడి గాంధీ బొమ్మ వద్ద గల ఎస్కోల్ ప్రార్థనా మందిరం దగ్గర సోమవారం ఏర్పాటు చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు గుంపుల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని వైద్య సేవలు పొందాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా సోమేశ్వరస్వామి రథోత్సవం

కడియం: మురమండలో సర్వకామదాంబ సమేత సోమేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం కోలాహలంగా జరిగింది. పురాణ ప్రాశస్త్యం కలిగిన ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో ఘనంగా రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని రథం తాడు లాగి మొక్కుబడి తీర్చుకున్నారు. ఆలయ కమిటీ తరపున తగిన ఏర్పాట్లు చేశారు. కడియం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొత్తపేట

మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి కొత్తపేటలో చోటుచేసుకుంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. బోడి పాలెం సమీపంలోని బాబా కాలనీకి చెందిన కర్రి మాసరయ్య(39) శనివారం రాత్రి ఊరు వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ సమయంలో అతనిని బోడిపాలెం వంతెన వద్ద గల సాయిబాబా గుడి సమీపంలో అమలాపురం వైపు నుంచి వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కింద పడిపోయిన అతనిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహానికి ఆదివారం పోస్టు మార్టం చేసి బంధువులకు అందజేశారు. కొత్తపేట అదనపు ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదు చేశారు.

సారా స్వాధీనం : ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-కొత్తపేట

సారా తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. కొత్తపేట ఎస్ఐ జ్వాల సాగర్, సిబ్బందికి అందిని సమాచారం మేరకు కొత్తపేట మండలం రామారావుపేటలో సారా తయారీ చేస్తున్న వారిపై శనివారం విసత దాడులు జరిపారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 800 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వారి నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం పర్చుచుకుని కేసు నమోదుచేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై టిడిపి నేతల నిరసన

వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్‌పై టిడిపి నేతలు ఆదివారం నిరసన తెలిపారు. దీనిని రద్దుచేయాలని డిమాండ్‌చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా తీసుకు వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తో పేదలు తమ భూములపై హక్కులు కోల్పోతున్నారని టిడిపి అమలాపురం పార్లమెంటు ఇన్చార్జ్ హరీష్ బాలయోగి విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆత్మనూన్యతా భావంతో ఆత్మహత్య లకు పాల్పడుతున్న పేదల మరణాలకు వైసిపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లోపాలను ఖండిస్తూ ఆయన కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. **మండపేట**వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ కరువైందని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలోని ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరంలో బిసి చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన మూడెకరాల భూమి వైసిపికి చెందిన నాయకులు లాక్కోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. భూమిని లాక్కోవడంతో కుటుంబం ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. వైసిపిని రాబోయే ఎన్నికల్లో ఓడించకపోతే ప్రజల ఆస్థులకు రక్షణ ఉండదన్నారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టిడిపి నాయకులు గుండు వీరతాత రాజు, కొవ్వాడ అప్పనబాబు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి..భూ హక్కు చట్టం పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు సిఎం జగన్ కుట్ర పన్నారని బండారు సత్యానందరావు ఆరోపించారు. అనంతరం నిరసనగా కొత్తపేటలో టిడిపి కార్యాలయం వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలుతో కలిసి కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కొత్తపేట మండల టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-మండపేట

ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టణ సిఐ అఖిల్ జామ, అడిషనల్ ఎస్ఐ నాంచారయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో కలిసి మండలంలోని మారేడుబాక ఫైర్ స్టేషన్ వద్ద కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ వద్ద కాలనీ ప్రజలతో వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని వారు మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ఓటు వేసే సమయంలో నిర్భయంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఏఎస్ఐ చిన్నారావు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -కాట్రేనికోన

వైసిపి చెందిన పలువురు కార్యకర్తలు టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో ఆదివారం ఆ పార్టీలో చేరారు. వేట్లపాలెం గ్రామంలో శీలం సూర్యనారాయణ ఆధ్వర్యంలో అనేకమంది వైసిపి కార్యకర్తలు, జిల్లెల్ల వారి పేట గ్రామంలో గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో 30 మంది వైసిపి కార్యకర్తలు, భూల వారి పేట గ్రామంలో 20 మంది వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వీరందరికీ బుచ్చి బాబు టిడిపి కండువాలను పార్టీలో ఆహ్వానిం చారు. కార్యక్రమంలో గుత్తులసాయి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని వెలంపాలెం గ్రామంలో ఆదివారం టిడిపి శ్రేణులు ఏర్పాటు చేసిన సమావేశాన్ని అనుమతులు లేవంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడికి విచ్చేసిన టిడిపి, జనసేన పార్టీ కార్యకర్తలు వెనుతిరిగి వెళ్ళిపోయారు. ఇక్కడ గ్రామంలోనే సర్పంచ్ టేకుమూడి సుజాత, భర్త సత్యనారాయణ వైసిపి నుంచి టిడిపిలో చేరుతారని, వారితో పాటు కొందరు కార్యకర్తలు టిడిపిలోలో జాయిన్ అవుతారని ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల నిబంధన ప్రకారం ఎంసిసి అధికారుల అనుమతులు తీసుకుని సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంది. అనుమతులు లేకుండా సమావేశం ఏర్పాటు చేయడంతో మండల పరిషత్ అధికారి రామచంద్ర మూర్తి పోలీసుల సహాయంతో సమావేశాన్ని అడ్డుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులను కార్యకర్తలను వెళ్లిపోవాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు

ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్





ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా, శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ అన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఆయన ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు నిర్దిష్టంగా అనుమతులు తీసుకుని ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలకు అనుగుణంగా ప్రచారాలు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇంకా ఇతర అంశాలు ఆయన మాటల్లోనే విందాం.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అది నుంచి చివరి వరకు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని సందర్భాల్లో పరిస్థితి గనుక అదుపు తప్పితే నియంత్రించడానికి సిద్ధంగా ఉన్నాం.

కట్టుదిట్టమైన భద్రత

ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల అధికారులు ఓటర్ల భద్రతకు సిఐ, ఎస్ఐ స్థాయి అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేస్తున్నాం. వీరు బాడీ టచ్ కెమేరాలు ధరించి ఉంటారు. ప్రతి పోలింగ్ బూత్ పోలీస్ సిసి కెమేరాలతో కంట్రోల్ రూముకు అనుసంధానం చేస్తారు. వీటి ద్వారా బూత్ స్థాయిలో శాంతిభద్రతలపై ఎప్పటికప్పుడు నిర్దిష్టమైన పర్యవేక్షణ చేయడానికి వీలుంటుంది.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగం

ఈ ఎన్నికల నిర్వహణలో పారదర్శకత శాంతిభద్రతల పరిరక్షణ, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూసేందుకు ఎన్నికల సంఘం సాంకేతికతకు పెద్ద పీట వేసింది. ఎన్నికల ప్రకటన విడుదలైనప్పటి నుంచి మొత్తం ప్రక్రియ పూర్తయ్యే వరకూ ప్రతి అనుమతిని, ఫిర్యాదుల నిర్వహణను సాంకేతికతతో ముడిపెట్టారు.

సువిధ యాప్ ద్వారా అనుమతులు

పార్టీలు, అభ్యర్థులు ఇలా ఎవరైనా ఎన్నికలకు సంబంధించిన ప్రచార అనుమతులు పొందేందుకు 'సువిధ' యాప్‌ను వినియోగించుకోవాలి. యాప్‌లో అడిగిన వివరాలు పొందుపరిచి అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి. ఇవి రిటర్నింగ్ అధికారికి చేరుతాయి. ఆయన సంబంధిత శాఖలకు పంపి అనుమతులపై నిర్ణయం తీసుకుంటారు. నిబంధనల ఉల్లంఘన, అసాంఘిక చర్యలు, సంబంధిత ఇతర వివాదాలపై ఫిర్యాదు చేసేందుకు సీ-విజిల్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో ఫొటోలు, లొకేషన్లతో సహా సమస్యపై ఫిర్యాదు చేయవచ్చు. ఈ రెండు యాప్ లు పూర్తిగా ఎన్నికల సంఘం పరిధిలోనే కొనసాగుతాయి.

నిరంతరం నిఘా

అధికారులకు ఎవరైనా రూ.50 వేలకు మించి డబ్బుతో పట్టుబడితే దానికి తగిన ఆధారాలు చూపాలి. అనుమానం వచ్చినా, తగిన పత్రాలు లేకపోయినా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్ (ఎంసిసి), ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్టి), స్టాటిక్ సర్వైలెన్స్ టీములు (ఎస్ఎస్టీ) సంయుక్తంగా తనిఖీ చేసి, పట్టుబడిన నగదును, బంగారం, బహుమతులను సీజ్ చేస్తాయి. వీటిని ఎన్నికల అధికారి సమక్షంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టీముకు స్వాధీనం చేస్తారు. వీటి విడుదలపై అక్కడి వెన్స్ కమిటీ రెండు రోజుల్లోపే నిర్ణయం తీసుకుంటుంది.

ప్రచార వాహనాలపై స్టిక్కర్లు

ప్రచార వాహనాలకు అనుమతి పత్రాలు లేదా స్టిక్కర్లు తప్పనిసరిగా అతికించాలి. ఈ స్టికర్లు అతికించని వాహన చోదకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. ప్రచార వాహనాలతో పాటు వచ్చే జనంపై ఎంతమంది అనే అంశంపై కూడా స్పష్టత ఉండాలి. ఎన్నికల సంఘం అనుమతులు లేకుండా గుంపులుగా ప్రచారాలు, సభలు, ర్యాలీలు నిర్వహించకూడదు. లౌడ్ స్పీకర్ల వినియోగానికి కూడా అనుమతి తప్పనిసరి. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయి.

లైసెన్స్ తుపాకులు స్వాధీనం

జిల్లాలో 324 తుపాకులకు అనుమతి ఉండగా, ఇప్పటికే 263 స్వాధీనం చేసుకున్నాం. వీటిని తిరిగి కౌంటింగ్ పూర్తయిన తర్వాత తిరిగి అప్పగిస్తారు. అత్యవసర సేవల కోసం 61 తుపాకులను మినహాయింపు ఉంది.

బైండోవర్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పలువురు రౌడీషీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. గత ఎన్నికల్లో వివాదాలకు కారకులైన వారు, రాజకీయ వివాదాలు, ఘర్షణల్లో కీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తులను బైండోవర్ చేసి, ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాం.

చెక్ పోస్టుల ద్వారా తనిఖీలు

ఎన్నికల వేళ అక్రమ మద్యం నియంత్రణపై స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (సెబ్) బందం పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక చర్యలు చేపడుతోంది. జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉన్న నాలుగు ప్రధాన మార్గాల్లో ఇప్పటికే కట్టుదిట్టంగా చెకోపోస్టులు కొనసాగుతుండగా, మరో 10 కలిపి, వీటి సంఖ్యను 14కు పెంచాం.

కౌంటింగ్ పూర్తయ్యే వరకూ నిబంధనలు

పోలింగ్ వరకే కాకుండా కౌంటింగ్ పూర్తయ్యే వరకూ నిబంధనలు అమలు చేస్తాం. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు. ప్రచారాలు, ర్యాలీలు, సభల నిర్వహణకు ఎన్నికల సంఘం అనుమతి పొందాలనుకునే వారు 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలి. అనుమతులు లేకుండా కేవలం దరఖాస్తు చేసి కార్యక్రమాలు నిర్వహించుకోవడం నిబంధనల ఉల్లంఘనే అవుతుంది. ఒకే ప్రాంతంలో ఒకే సమయంలో ప్రచారాలకు అనుమతి లేదు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికే అనుమతి ఇస్తాం.

యానాం వార్తలు

యానాంలో ఘనంగా చక్ర తీర్థం

ప్రజాశక్తి - యానాం



చక్ర తీర్థానికి తరలివచ్చిన మహిళలు

యానాం వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం చక్ర తీర్థం ఘనంగా జరిగింది. యానాం పరిసర ప్రాంత ప్రజలు, మహిళలు తీర్థా నికి తరలివచ్చారు. ఉదయం చక్రస్నానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ గాంధీ బీచ్ వద్ద గౌతమి గోదావరిలో ఆలయ అర్చకులు, వేదపండితులు ఉత్సవదారులచే స్వామి వారికి చక్రస్నానం చేయించారు. యానాంకు చెందిన డాక్టర్ ఎంవిఎస్.ప్రసాద్ కుమారులు ఆధ్వర్యంలో చక్రస్నానం పూజా కార్యక్రమాన్ని జరిపించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు

ప్రజాశక్తి - యానాం

యానాం రీజెన్సీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు ఆదివారంతో ముగిసింది. చివరిరోజు కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు యాంటీ ప్లాస్టిక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ రమాబాయినగర్, మెట్టకూరు, గణపతినగర్, ఆదిఆంధ్రపేట గ్రామాల మీదుగా సాగింది. ప్లాస్టిక్ వినియోగంను అరికట్టాలని నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం రీజెన్సీ పబ్లిక్ స్కూల్ పార్కింగ్ ఏరియాలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ సరెల్ల వీరకుమార్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూల గరగల ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం



కాంత్రాకోటలో పూల గరగల ఉత్సవం

మండలంలోని కాండ్రకోట గ్రామంలో ఉగాది నుంచి ప్రారంభమై 40 రోజులు పాటు జరిగే నూకాలమ్మ అమ్మ జాతరలో భాగంగా ఆదివారం పూల గలగల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి టి.సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ గవరసాన వీరాస్వామి, ధర్మకర్తలు, జడ్పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, మాకిరెడ్డి శ్రీనివాస్, జాగు వీరభద్రరావు, గవరసాన రాజశేఖర్ పాల్గొన్నారు.

శోభన్‌బాబుని పరామర్శించిన కన్నబాబు



సీనియర్ జర్నలిస్ట్ శోభన్ బాబును పరామర్శిస్తున్న కన్నబాబు

ప్రజాశక్తి - కరప

మండలంలో పెనుగుదురు గ్రామానికి సీనియర్ జర్నలిస్ట్ గునిపే శోభన్‌బాబు ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పరామర్శించారు. ఇటీవల శోభన్‌బాబు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం కన్నబాబు ఆయనను పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో రెడ్డిపల్లి వరరమేష్, ఎంపిపి శ్రీ లక్ష్మి, జడ్పిటిసి వై.సుబ్బారావు, తుమ్మలపల్లి గోవిందు, బండారు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగుతున్న ఎన్నికల ప్రచారం.. చేరికలు..

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైసిపి, టిడిపి, జనసేన అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక పార్టీలోంచి మరో పార్టీలో చేరుతున్నారు. **తాళ్లరేవు** మండలంలోని చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం ప్రాంతాల్లో వైసిపి ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి, ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సాగర్, నాయకులు బూరెల వెంకటరాజు, కాదా గోవింద్ కుమార్, యర్రంనీడి అప్పారావు, బొంతు మోహన్, దెయ్యాల సత్యనారాయణ, పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని తిరుపతి గ్రామానికి చెందిన పలువురు వైసిపిలో చేరారు. వీరికి వైసిపి నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, పులిమేరు సొసైటీ అధ్యక్షులు గోపు నారాయణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, గోపు మురళి, దేవస్థానం చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం పట్టణానికి చెందిన పలువురు స్వర్ణకార వర్తకులు ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సమక్షంలో టిడిపిలో చేరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి చినరాజప్ప పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, మాజీ వైస్ చైర్మన్ కొరిపూరి రాజు, యాళ్ల వీరబాబు, మహమ్మద్ ఆరిఫ్‌అలీ పాల్గొన్నారు. **కరప** కరప గ్రామ జనసేన నాయకులు వైవివి.సత్య నారాయణ అధ్వర్యంలో గ్రామంలోని సీతమ్మ పేట, పల్లపు వీధిలకు చెందిన వాసంశెట్టి మహేశ్వరరావు, చిన్నారి శ్రీనివాస్ నాయకత్వంలో పలువురు జనసేన పార్టీలో చేరారు. వీరికి జనసేన కాకినాడ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని మాధవపట్నం గ్రామంలో ఎంఎల్ఎ చినరాజప్ప, జనసేన ఇన్‌ఛార్జ్ కొమ్మల బాబు, బిజెపి నాయకడు విత్తనాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనివాస్, గొల్లపల్లి సర్వేశ్వరరావు, కుర్ర రాజు, చీకట్ల వెంకటేష్, బచ్చల జేమ్స్, రాజా సూరిబాబురాజు, పేంకే వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే కొత్తూరు ప్రాంతానికి చెందిన విగ్నేశ్వర రజక సంఘానికి చెందిన పలువురు వైసిపలో చేరారు. వీరికి వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజస్, నాయకులు దవులూరి సుబ్బారావు, మన్యం చంద్రరావు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని పల్లపు చామవరం. రాజవరం గ్రామాల్లో గడప గడపకూ వైసిపి కార్యక్రమం వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు, తాతాజీ, సర్పంచు శ్రీను, గోరకపూడి రాజు, జి.కొండబాబు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని జె.అన్నవరం గ్రామంలో టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపిలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ.కార్యక్రమంలో గొల్లపల్లి బుజ్జి, బొరుసు శ్రీనివాస చక్రవర్తి, జ్యోతుల పెదబాబు పాల్గొన్నారు.

చికిత్స కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాకినాడ



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

మూర్ఛ వచ్చి మతిస్థిమితం కోల్పోతున్న పేదింటి చిన్నారికి వైద్య ఖర్చుల నిమిత్తం చేయూత స్వచ్ఛంద సంస్థ రూ.80 వేల సాయాన్ని అందించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన ఆరు సంవత్సరాల లంక గౌతమికి ప్రతి ఐదు నిమిషాలకు ఉన్నట్టుండి మూర్ఛవచ్చి మతిస్థిమితం కోల్పోతుందన్నారు. చికిత్స నిమిత్తం రాజానగరం జిఎస్ఎల్ ఆసుపత్రిలో చేర్పించగా చిన్నారికి రూ.80 వేల విలువ చేసే 8 ఇంజక్షన్లు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ విషయాన్ని తెలుసుకున్న చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిజ నిర్ధారణ బృందం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారని, అనంతరం చిన్నారి తండ్రి లంకా ప్రసాద్‌కి రూ.80 వేల చెక్కును ఆసుపత్రి వద్ద అందించడం జరిగిందన్నారు. సమాజంలో ఆపన్నులకు మేమున్నామనే భరోసా కల్పించాలనే సంకల్పం ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని రవికుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో చేయూత సంస్థ ఆర్థిక కార్యదర్శి చింత నారాయణమూర్తి, ఉపాధ్యక్షులు వల్లి భాష, సంస్థ సహాధ్యక్షులు శ్రీనివాస వినీల్, పెద్దాపురం ఇన్‌ఛార్జ్ వీర శివ పాల్గొన్నారు.

స్థిరాస్తులను కాజేసే కుట్ర : వనమాడి

ప్రజాశక్తి - కాకినాడ



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్ కుట్రలు పన్నాడని టిడిపి కాకినాడ అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి వనమాడి కొండబాబు విమర్శంచారు. ఆది వారం ఏర్పాటు చేసిన పాత్రి కేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని సహజవనరులను దోచుకున్న వైసిపి నేతలు ఇప్పుడు ప్రజల స్థిరాస్తులపై పడ్డారని ఆరోపించారు. ప్రజల స్థిరాస్తులను లాక్కుంటూ జగన్ మూకుమ్మడి ఆత్మహత్యలను ప్రేరేపిస్తూ పేద కుటుంబాలను ఛిద్రం చేస్తున్నడన్నారు. భూ హక్కుల చట్టం పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్ కుట్ర పన్నాడని, రాష్ట్రంలో ప్రజల ఆస్థులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరంలో బిసి చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన మూడెకరాల భూమిని వైసిపికి చెందిన నాయకులు లాక్కోవడంతో మొత్తం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడ్డారని అన్నారు. ప్రజల ఆస్తులు ఏవిధంగా అన్యాక్రాంతం అవుతున్నాయో చెప్పడానికి ఇదొక ఉదాహరణగా నిలుస్తుందన్నారు. పౌరుల భూహక్కుల్ని దెబ్బతీసేందుకే నల్లచట్టాలను తీసుకొచ్చారని అన్నారు. ఈ నల్లచట్టంతో జగన్ ముఠా పేద రైతుల భూముల్ని ఇష్టారీతిన కొట్టేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు.

పెద్దాపురంలో కాగడాల ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

భగత్ సింగ్ ,రాజ్ గురు, సుఖదేవుల వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ, ఐద్వా, పిఎన్ఎం, సిఐటియు, మన పెద్దాపురం ఫేస్బుక్, సోషల్ మీడియా ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించి నివాళు లర్పించారు. నువ్వుల గుంట వీధి సెంటర్ లోని భగత్ సింగ్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ కాగడాల ప్రదర్శన మెయిన్ రోడ్,మున్సిపల్ సెంటర్ మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక నాయకులు బి.అనంతరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మన పెద్దాపురం ఫేస్బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్, బిఎస్‌పి నాయకులు అరుణ్ కుమార్, ఎంఆర్ కళాశాల అధ్యాపకులు విల్లా లక్ష్మి,రాజ్ కుమార్, సిఐటియు నాయకులు గడిగట్ల సత్తిబాబు, దాడి బేబీ,స్నేహ, పద్మ,గూనూరు రమణ, వడ్డి సత్యనారాయణ, అరుణ, ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్ కుమార్, గోపాల్, పిఎన్ఎం నాయకులు కష్ణ సత్యనారాయణ వీర్రాజు రాంబాబు,సతీష్, రాజేష్ కుమార్, శ్రీనివాస్, భుజంగరావు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు వినయం అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న అల్లం రామశాస్త్రి దంపతులు

నేటి సమాజంలో యువత అభివృద్ధి పథంలో పయనించేందుకు చదువుతోపాటు వినయం ఎంతో అవసరమని హైదరబాద్‌కు చెందిన అల్లం చారిటబుల్ ట్రస్ట్ అధినేత అల్లం రామశాస్త్రి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వేట్లపాలెం గ్రామంలో వివేకానంద ట్యుటోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో అత్యంత స్థానాలకు వెళ్లడానికి ప్రతి ఒక్కరు విద్యతోపాటు వినయం సమయస్ఫూర్తి అలవర్చుకోవాలన్నారు. తాను దువ్వూరి సుబ్బారావు, రంగరాజన్, రఘురామరాజు తదితర ఆరుగురు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ల వద్ద విధులను నిర్వర్తించినట్లు తెలిపారు. తమ ట్రస్ట్ ద్వారా హైదరాబాదులో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సందర్భంగా వేట్లపాలెం రామకష్ణ ధ్యాన మందిరం నిర్వహిస్తున్న సేవలనుకొనియాడారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - కరప



పూజలు చేస్తున్న ఎంఎల్ఎ కన్నబాబు

మండలంలోని వాకాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతలు ముసాలమ్మ, సోమాలమ్మ అలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, జనసేన కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన పూజా కార్యక్రమంలో గ్రామ చుట్టుపక్కల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడబాలసత్య ప్రసాద్, జడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఎంపిపి పి.శ్రీలక్ష్మి, చింత ఈశ్వరరావు, టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు.

వరి కోతలకు రైతులు సన్నద్ధం

ప్రజాశక్తి-రామచంద్రపురం



పాణింగపల్లి గ్రామం వద్ద కోతకు సిద్ధంగా ఉన్న పంట చేలు

రైతులు వరి కోతలు కోసేందుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు తొలకరిలో వచ్చిన నష్టాలు పూడ్చుకునేందుకు దాల్వా పంటపై ఆశలు పెట్టుకున్నారు. డిసెంబర్ చివర వారం నుంచి జనవరి వరకు నాట్లు పూర్తి చేయడంతో ప్రస్తుతం దాల్వాపంట ఈనిక దశ నుండి గింజ పాలు పోసుకుని తయారయ్యే దశకు చేరుకున్నాయి. మరో 10 - 15 రోజుల్లో కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసారి నీటి ఎద్దడి అంతగా లేకపోవడంతో పంట ఆశ జనకంగా ఉందని రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దాల్వాలో రైతులు ఎంటియు 3626 అనే బొండాలు రకాన్ని 80 శాతం నాట్లు వేయగా ఎన్ టి యు 1121 సన్నాలు రకాన్ని మరో 20 శాతం మంది రైతులు నాట్లు వేసుకున్నారు ఈసారి వాతావరణం కూడా అనుకూలించడంతో పంటలు బాగా పండాయి.

ఏప్రిల్ మొదటి నుంచి నెలాఖరు వరకు పనులు రద్దీగా ఉంటాయని మండల వ్యవసాయ అధికారి బలుసు రవి తెలియజేశారు. ప్రస్తుతం దాల్వో వరి చేరుకు అక్కడక్కడా కాండంతో దుబ్బు కుళ్ల ఆశించే అవకాశం ఉందని వాటికి కొన్ని మందులు పిచికారీ చేసుకోవాలని వ్యవసాయాధికా రవి తెలిపారు. తొలచే పురుగు కనిపించినప్పుడు కార్బస్ హైడ్రోక్లోరైడ్ అనే మందును ఎకరాకు 400 గ్రాములు పిచికారీ చేసుకోవాలని దుబ్బుకుళ్ళు కనిపించిన రైతులు పెబికాన్ జోన్ అనే మందును ఎకరాకు 200 గ్రాములు పిచికానా చేసుకోవాలని వ్యవసాయ అధికారి తెలియజేశారు.